క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్



కూచిపూడి(మొవ్వ): పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ముందు గ్రాండ్ టెస్ట్ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి 4:30 వరకు జరిగే ఈ పరీక్షలకు ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల నుంచి 530 మంది పరీక్షలు హాజరయ్యారు. దీనిలో 8 జిల్లా పరిషత్ ఒక ఎయిడెడ్ పాఠశాల నుంచి 385 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రైవేట్ పాఠశాలల నుంచి 145 మంది విద్యార్థులు హాజరయ్యారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

గుడివాడరూరల్: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ గుడివాడలో రోడ్ల సమస్యను ప్రత్యేకంగా గుర్తించాలని శాసనసభ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రధానంగా గుడివాడ బైపాస్‌రోడ్డు, గుడివాడ-పోలుకొండ రోడ్డు, పోలుకొండ-ఇలపర్రు రోడ్డు తదితర రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడరూరల్: మండలంలోని మోటూరు గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీవీకే సంజీవనీదేవి సోమవారం కోరారు. ఈ నెల 6వ తేదీ చివరి తేదీ అని పేర్కొన్నారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



గుడివాడటౌన్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని విశాఖపట్నానికి చెందిన మణి ప్రసన్న అన్నారు. స్థానిక శ్రీ రమణ మహర్షి ధ్యాన కేంద్రంలో సోమవారం సామూహిక ధ్యానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మణిప్రసన్న లలితా సహస్రనామాలపై ప్రసంగించారు. ధ్యానం ఆరోగ్యం, ఆయుష్షను పెంచుతుందన్నారు. ధ్యానం ప్రాముఖ్యత, ప్రస్తుత సమాజంలో మానసిక ప్రశాంతతకు ధ్యానం ఏ విధంగా ఉపయోగపడుతుంది తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్ర నిర్వాహకురాలు రాజకుమారి, ధ్యానప్రియులు పాల్గొన్నారు. అనంతరం మణి ప్రసన్నను సత్కరించారు.

పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ



ప్రాకర్ల(పామర్రు): వేసవి దృష్ట్యా పాఠశాల పూర్వ విద్యార్థిని పాఠశాలకు రెండు ఫ్యాన్లను బహూకరించారని హెచ్‌ఎం రాయన శివరామ ప్రసాద్ తెలిపారు. మండల పరిధి ప్రాకర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు దాత ఫ్యానులను సోమవారం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థిని ప్రస్తుతం హైదరాబాద్ నివాసి అయిన మద్దాలి శారద వేసవిలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రూ.5 వేల విలువ చేసే రెండు ఫ్యాన్లను పాఠశాలకు బహూకరించారన్నారు ఫ్యాన్లను దాత తల్లి బండి విజయలక్ష్మి అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గణేష్, స్థానిక పెద్దలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వరీ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



గుడ్లవల్లేరు: పెసరమిల్లిలో ఈ నెల 6వ తేదీన శ్రీ రాజ రాజేశ్వరీ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగనుంది. ఈ ఉత్సవాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు సోమవారం తెలిపారు. అమ్మవారి ఆలయంతో పాటు సాయిబాబా మందిర ప్రతిష్ఠను చేపట్టనున్నారు. విశేష పూజలు, హోమాలతో పాటు అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

కొండెక్కిన పశుగ్రాసం ధరలు

- భారంగా పశుపోషణ
- వేధిస్తోన్న వరిగడ్డి కొరత
- గ్రామాల్లో తగ్గుతున్న పాడి గేదెల శాతం



వరిగడ్డిని ట్రాక్టర్‌పై తీసుకువెళ్తున్న రైతులు

పామర్రు: దేశానికి వెన్నెముక రైతు అయితే రైతుకు వెన్నెముక పశు సంపద. అలాంటి పాడి పశుపోషణ ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. పెరిగిన ధరలతో పోషణ భారంగా మారుతోంది. దీనితో పశువుల సంఖ్య ఏటేటా గణనీయంగా తగ్గిపోతున్నాయి. చివరికి గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్యాకెట్ పాలు తాగాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో మండలంలో 30 వేల వరకు పశువులు ఉండగా ప్రస్తుతం గేదెలు 15 వేలతో పాటు ఆవులు, ఎద్దులు 4 వేల వరకు మాత్రమే ఉన్నాయి. పశుగ్రాసం కొరత పెరుగుతున్న దాణా ఖర్చులతో రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. రేయింబవళ్లు కష్టపడినా రోజు కూలీ కూడా రాని దయనీయమైన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో లీటరు పాలు రూ.100లు అయ్యే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారీగా పెరుగుతున్న ఖర్చులు

పాడి గేదెలకు అందించే గడ్డితో పాటు మినరల్ మిక్సర్, దాణా, కొబ్బరి పొడి, ఉలవ పొట్టు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంటలను మిషన్లతోనే నూర్పిళ్లు చేయటం కారణంగా వరి గడ్డి ఉపయోగం లేకుండాపోయింది. వరి సాగులో కుప్పలు వేసి నూర్పిళ్లు చేసే రైతులు తగ్గిపోవడంతో గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. గతంలో రూ.20లు ఉన్న ఎండు గడ్డి కట్ట ప్రస్తుతం రూ.50 నుంచి రూ.70 వరకూ పెరిగింది. అధిక ధర వెచ్చించినా గడ్డి సంవృద్ధిగా దొరికే పరిస్థితి లేదు. ఈనేపథ్యంలో గేదెలను మేపడం వీలు కాక చాలా మంది ఒకటి రెండు గేదెలను ఉంచుకుని మిగిలిన వాటిని అమ్ముకుంటున్నారు. కూలీల ఖర్చు తగ్గించుకోవడానికి రైతులు వరికోతలను యంత్ర పరికరాలతో కోయించడంతో వరి గడ్డి పనికి రాకుండా పోతోంది. ఈనేపథ్యంలో గడ్డినికొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

గిట్టుబాటు కాని ధరలు

ఎంతో కష్టపడి కేంద్రానికి పాలు పోస్తే అక్కడ లభిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదని పాల ఉత్పత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల్లో వెన్న శాతం 10.0 పాయింట్లు వస్తేనే రూ.85 నుంచి రూ.86లు చెల్లిస్తున్నారు. వెన్న శాతం తక్కువగా ఉండడంతో ఒక లీటరుకు రూ.40-50 లకు మించి గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. వచ్చే ఆదాయం మొత్తం పెట్టుబడులకే పోతుండడంతో లాభాలు రాక పశువులను విక్రయిస్తున్నారు. సంక్షోభంలో ఉన్న పాడి పరిశ్రమను ప్రభుత్వం తగిన సహకారం అందించి ఆదుకోవాలని పశు పోషకులు కోరుతున్నారు.

గిట్టుబాటు కావడం లేదు..



మార్కెట్‌లో పెరిగిన రేట్లకు దాణా తదితరాలను కొనుగోలు చేసి పశువులను మేపాలంటే ఇబ్బంది కరంగా ఉంటోంది. పోసిన పాలకు సరైనా గిట్టుబాటు ధర రాకపోవడం వలన నష్టాలను చవిచూస్తున్నాం. పాలకు గిట్టుబాటు ధర కల్పించి పశు పోషకులను ఆదుకోవాలి.

– కె.రామదాసు , రైతు

పశువులను అమ్ముకుంటున్నాం..



పాలు విక్రయించగా వచ్చిన నగదుకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి పశుగ్రాసానికి అయ్యే ఖర్చుకు చాలా వ్యత్యాసం ఉంటోంది. ప్రతి నెలా నష్టాలు వస్తున్నాయి. దీనితో పశుపోషణ కష్టంగా మారటంతో పశువులను అమ్ముకుంటున్నాం.

– యు.నాగమల్లీశ్వరరావు, పశుపోషకుడు

సీఎం చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, నాయకులు

పామర్రు: వైఎస్సార్ సీపీ వాళ్లకు చిన్న పని చేసినా ఊరుకోబోనని సీఎం చంద్రబాబు నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ నాయకులు, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల శ్రీనాథ్ రెడ్డి, ఆరేపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులకు కార్యకర్తలకు ఏ స్థాయిలో అయినా ఎటువంటి పనులు చేయవద్దన్నారు. వాళ్లకు పనులు చేస్తే ఊరుకోనని చెప్పడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు కుల మత ప్రాంత పార్టీ అని తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వ అన్ని పథకాలను అందజేసిన సంగతి గుర్తు చేశారు. చివరికి తెలుగు దేశం నాయకులు కార్యకర్తలకు కూడా పార్టీ చూడకుండా ప్రభుత్వ పథకాలను అందజేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

తల్లికి వందనం నిధులేవీ ?

రాష్ట్రంలోని ప్రజానీకం ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అందరినీ సమానంగా చూస్తామని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేయటం అనేది మా అందరినీ తీవ్రంగా బాధిస్తోందన్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఎంతో డబ్బు చెల్లిస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే విద్యార్థుల డేటా ప్రభుత్వం వద్ద ఉందని, దీనికి అనుగుణంగా అందరికీ తల్లికి వందనం కేటాయించే విధంగా బడ్జెట్‌లో నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పామర్రు-3 ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయటంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ముందుండి నెరవేర్చి చూస్తానని హామీ ఇచ్చారు, కానీ ఇంత వరకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. పార్టీ నేతలు కూసం పెద వెంకటరెడ్డి, నత్తా నాని, వీరంకి అర్జునరావు పాల్గొన్నారు.

ఏఎన్నార్ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు



గుడివాడటౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో షార్ట్‌టర్మ్ కోర్సులు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. సోమవారం కోర్సుల ప్రారంభం సందర్భంగా బజాజ్ ఫైనాన్స్ సర్వీసెస్ గుంటూరుకు చెందిన లీడ్ ట్రైనర్ పి.రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని క్లాసులు నిర్వహించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ వంటి సర్టిఫికెట్ కోర్సులకు ఇక్కడ శిక్షణ ఉంటుందన్నారు. ఆచరణాత్మకమైన జ్ఞానం పొందుతారని చెప్పారు. సర్టిఫికెట్ కోర్సుల్లో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారికి బజాజ్ ఫిన్ సర్వీసెస్ లిమిటెడ్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. దీనికి 80 శాతం హాజరు తప్పనిసరి అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది.

8న జాతీయ లోక్ అదాలత్

కైకలూరు: దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ చక్కటి వేదికగా నిలుస్తోందని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి సోమవారం చెప్పారు. ఈ నెల 8న కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. రాజీపడదగిన కేసులన్నింటినీ కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీమార్గమే రాజ మార్గమనే సత్యాన్ని అందరూ గ్రహించాలని కోరారు.

పెద్దింట్లమ్మా.. చల్లని దీవెనలివ్వమ్మా

మూడో రోజుకు చేరిన పెద్దింట్లమ్మ జాతర



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి

కైకలూరు: పెద్దింట్లమ్మా.. చల్లని ఆశీస్సులు అందించమ్మా అంటూ ప్రజలు భక్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర సోమవారానికి మూడో రోజుకు చేరుకుంది. సమీప గ్రామాల భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ అమ్మవారికి పంచహారతులు అందించారు. అమ్మవారికి వస్త్ర, పుష్పాలంకరణ చేశారు. భుజబలపట్నం గ్రామానికి చెందిన అల్లూరి జ్ఞానేంద్ర వర్మ, సురేష్‌రాజు ప్రసాద వితరణ చేశారు. ముదినేపల్లికి చెందిన కట్టా లక్ష్మీరత్నకుమారి ఆధ్వర్యంలో గీతాపారాయణం, ప్రవచనం ఆకట్టుకుంది. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఈ నెల 13 వరకు అమ్మవారి జాతర కొనసాగుతుందన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



పామర్రు: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా స్థానిక చిన్న మసీదులో సోమవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనలు పూర్తిచేసిన తర్వాత ముస్లింలందరూ కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సాయంత్రం నమాజ్ పూర్తి చేసి తర్వాత ఇఫ్తార్ విందులో అందరూ పాల్గొని సహసంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు యూనుస్, మున్వర్, కరీముల్లా, అబ్బాస్, ఆరీఫ్, షరీఫ్‌లు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



పామర్రులో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



మొవ్వలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

కైకలూరు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల ముందే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటుకు సంబంధించి కైకలూరు మండలంలో 5 కాలేజీలు, మండవల్లి మండలంలో రెండు కాలేజీలు కలిపి కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, విజ్ఞాన్ కాలేజీ సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. కలిదిండి మండలంలో మూడు కాలేజీలకు సంబంధించి కలిదిండి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ముదినేపల్లి మండలంలో మూడు కాలేజీలకు, ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 4 పరీక్ష కేంద్రాల్లో రెండో సంవత్సరం ఇంటర్ పరీక్షలకు చెందిన 651 మంది విద్యార్థులకు 636 మంది పరీక్షలు రాశారు. మొత్తం 15 మంది గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్లు, పోలీసులు విధులు నిర్వహించారు.

పామర్రులో 10 మంది గైర్హాజరు

పామర్రు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 210 మంది విద్యార్థులకు గాను 200 మంది హాజరయ్యారని, 10 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తెలుగు, సంస్కృతం, ఉర్దూ సబ్జెక్టులలో పరీక్షలు జరిగాయని తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, వైద్యం, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మండల పరిధి నిమ్మకూరు ఏపీ గురుకుల కళాశాలలో జరుగుతున్న పరీక్షలను పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. అక్కడ ఉన్న వసతులను సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శాంభవి తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో 139 మంది హాజరు..

మొవ్వ: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జరిగిన పరీక్షకు 142 మంది విద్యార్థులకు గాను 139 మంది హాజరయ్యారని సీఎస్ సుధాకర్, డీవోజీ తెలిపారు. తెలుగు, హిందీ, జనరల్ ఫౌండేషన్ కోర్స్ రెండో పేపర్ పరీక్షలకు సిటింగ్ స్క్వాడ్‌గా హరికృష్ణ, సాయికుమార్ వ్యవహరించినట్లు పేర్కొన్నారు.

ముగిసిన కలిదిండి మరియమాత ఉత్సవాలు





హాజరైన విశ్వాసులు (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న పీఠాధిపతి రాజారావు

కైకలూరు: తల్లిదండ్రులు వారి బిడ్డలు సన్మార్గంలో పయనించే విధంగా ప్రార్థన చేయాలని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు చెప్పారు. కలిదిండి విచారణ చర్చిలో బంటుమిల్లి యోహాను ఆధ్వర్యంలో ఈ నెల 1న ప్రారంభమైన మరియమాత మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం భాస్కరరావుపేట విచారణకర్త టోమి జోసఫ్ ఆధ్వర్యంలో సమష్టి దివ్య పూజా బలి, జపమాల కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులను ఘనంగా సన్మానించారు. విజయవాడ ఆంధ్ర క్రైస్తవ నాట్యమండలి ఆధ్వర్యంలో గుమ్మడి జీవన్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో ఏసు కృప అనే బైబిల్ నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వేంకటేశ్వరరావు, భక్తులకు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వాహనాలను దారి మళ్లించారు. చివరి రోజున సమీప జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు.

గంగానమ్మ జాతర ప్రారంభం



అమ్మవారికి పూజలు చేసి, కమిటీ సభ్యులను సన్మానించిన కృష్ణారెడ్డి దంపతులు

పామర్రు: గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. గంగానమ్మ ఘటం కుండ, పోతురాజు గడలను గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని నాలుగు పొలిమేర్లలో అమ్మవారిని కట్టడి చేశారు. అనంతరం స్థానిక కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, శ్రీలక్ష్మి దంపతుల ఇంటి వద్దకు వచ్చిన అమ్మవారికి విశేష పూజాధికాలను నిర్వహించి నూతన వస్త్రాలను ఇచ్చి నివేదనలను సమర్పించారు. అనంతరం గంగానమ్మ ఆలయ కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, నందిపాటి బాల సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, బొమ్మారెడ్డి రాజేష్‌రెడ్డి, మర్రెడ్డి అంజిరెడ్డి, గుజవర్తి శేఖర్‌రెడ్డి, మున్నంగి శ్రీనివాసరెడ్డి, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, కూసం సుబ్బారెడ్డి, బి.మనోహర్ రెడ్డి, నందిపాటి ఓంకార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు జాతర జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, స్థానికులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, దక్షిణామూర్తి, జమీల్, కొల్లి నారాయణరెడ్డి, బి రామకృష్ణారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి



ఫోన్‌లో కలుషిత నీటి క్యాన్‌ను చూపుతున్న సమరం, ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడటౌన్: గుడివాడ నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో నందివాడ, రూరల్ మండలంలోని కొన్ని ప్రాంతాలలో పూర్తిగా చేపల చెరువులు ఏర్పడటంతో నీటి కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. దీని పరిష్కారానికి గత 20 ఏళ్లగా ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నామంటూ చెప్పడమే తప్ప కార్యరూపం దాల్చడంలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా ఉన్న పిన్నమనేని వెంకటేశ్వరరావు రూరల్ మండలం మోటూరులో 100 ఎకరాలు భూమి సేకరించి అక్కడ మంచినీటి ట్యాంక్ ఏర్పాటు చేసి నందివాడ, రూరల్ మండలాలకు ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారే తప్ప కనీసం ఆ పని చేపట్టిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో నందివాడ మండలం జొన్నపాడు సమీపంలో 110 ఎకరాలు పొలం కొనుగోలుచేసి ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు చేసి మంచినీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారని ఆ పథకం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇప్పుడు ఆ పథకం కనిపించడం లేదన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో పంచాయతీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ప్రతి గ్రామానికి ప్రత్యక్షంగా కృష్ణా నీటిని పంపిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కలుషితం లేని తాగునీటిని గుడివాడ నియోజకవర్గ ప్రజలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యాన్ని రక్షించాలి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు భాస్కరరావు, అప్పారావు తదితరులు

మండవల్లి: కొల్లేరు ప్రజల జీవనోపాధిని మెరుగుపరచి, వన్యప్రాణుల అభయారణ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండవల్లిలో ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం వన్య ప్రాణులను రక్షించుకోవలసిన ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ.. వన్య ప్రాణులు మానవ మనుగడకు ఎంతో అవసరమన్నారు. ప్రకృతిలో భాగమైన వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని చెప్పారు. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో 673 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కొల్లేరు అభయారణ్యంలో పక్షుల సంరక్షణ కేంద్రం ఉందన్నారు. కొల్లేరు మత్స్య సంపదకు, వలస పక్షులకు, అనేక వృక్షాలు జంతువులకు క్రిమికీటకాదులకు ఆవాసమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ టి.అప్పారావు, మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు గంజాల శ్రీనివాసరావు, గోన నాగరాజు, పి.పుండరీకాక్షుడు, టేకు బన్నీ, గుబిలి రామప్రసాద్, కోట వెంకట్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిర్మాణ పనుల పరిశీలన



మండవల్లి హైస్కూల్‌ను సందర్శిస్తున్న అధికారులు



ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న పంకజ్‌కుమార్

కైకలూరు: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష(ఏపీసీ) అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కూరేళ్ల పంకజ్‌కుమార్ అన్నారు. ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో పీఎంశ్రీ నిధులతో నిర్మిస్తున్న ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లిలో పనుల పరిశీలన..

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకంలో చేపట్టిన ల్యాబ్ నిర్మాణ పనులను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కురెళ్ల పంకజ్ కుమార్ సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్, ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, జోత్స్న, సీఆర్‌ఎం టి.స్మారకకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కైకలూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి చెప్పారు. ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిపితే సమీపంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏ.కృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.మధుర, ఎస్.కవిత, సీహెచ్ సుగుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.